సా మిల్లుల వ్యాపారులకు లాభం చేకూరేలా కృషి చేయాలి


చకిలం రమణయ్య

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న వుడ్ బ్యాలెన్స్ స్టడీతో సా మిల్లుల యజమానులకు, వృత్తిరీత్యా విశ్వకర్మలకు లాభం చేకూరేలా అటవీ శాఖ కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర టింబర్ సా మిల్లుల ఫెడరేషన్ అధ్యక్షుడు చకిలం రమణయ్య పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా అటవీ శాఖ అధికారులు చేపట్టక పెండింగ్‌లో ఉన్న ఈ వుడ్ బ్యాలెన్స్ స్టడీని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ సి.సువర్ణ ఆధ్వర్యంలో చేపట్టడం లక్షలాది మందికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఆదివారం తన కార్యాలయంలో రమణయ్య విలేకర్లతో మాట్లాడారు. బెంగళూర్ నుంచి ఇండియన్ వుడ్ సైన్స్ టెక్నాలజీ సంస్థ వారు నగరానికి వచ్చి అన్ని జోన్ల అధికారులకు వుడ్ బ్యాలెన్స్‌పై అవగాహన కల్పించడం ఎంతో గొప్ప ప్రక్రియ అన్నారు. ఎన్నో ఏళ్ల తరబడి తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న వుడ్ బ్యాలెన్స్ స్టడీని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ సువర్ణ చేపట్టడంతో ఆమెకు రమణయ్య కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో చెట్లు ఏ పర్సంటేజీలో అభివృద్ధి చెందుతుందో ఈ వుడ్ బ్యాలెన్స్ స్టడీ ద్వారా తెలుసుకోవడానికి సులభతరమైందని ఆయన పేర్కొన్నారు.

సన్మానం


రఫిక్ బేగ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

చాంద్రాయణగుట్ట: ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ప్రార్థనలు జరిపే చాంద్రాయణగుట్టకు చెందిన సంఘ సేవకుడు మీర్జా రఫిక్ బేగ్‌ను పలువురు ప్రముఖులు సన్మానించారు. అమెరికాలో స్థిరపడ్డ నగరానికి చెందిన ఆజం, ఎరాజ్, మాలిక్ తదితరులు ఆయనను పూలమాలతో సత్కరించారు. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల నడుమ నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు సడలాలని, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఎన్నికలలో పలువురు ప్రముఖులు విజయం సాధించాలని ఆయన ప్రార్థనలు జరుపుతూ సఫలీకృతుడవ్వడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

మజ్లిస్ సెక్యులర్ పార్టీ


నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్‌తో మహ్మద్ ముస్తఫా తదితరులు

గోల్కొండ: మజ్లిస్ సెక్యులర్ పార్టీ అని అన్ని వర్గాల వారికి పార్టీలో సముచిత స్థానం ఉందని ఆ పార్టీ నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ అన్నారు. మజ్లిస్ సీనియర్ నాయకులు మహ్మద్ ముస్తఫా ఆదివారం మెహిదీపట్నంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మజ్లిస్‌లో ఎప్పుడూ యువతకు ప్రత్యేక స్థానం ఉందని ఆయన అన్నారు. మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ యువ మజ్లిస్ నాయకులను ప్రోత్సహిస్తున్నారన్నారు.

గౌతంరావును కలిసిన ప్రభు పూజారి



గోల్కొండ: క్రమశిక్షణ, అంకిత భావానికి బీజేపీ పెట్టింది పేరు అని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆయన నియమింపబడిన సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యాలయ సహ కార్యదర్శి ప్రభు పూజారి ఆదివారం ఆయనను కలిసి అభినందించారు.

సత్కారం


డాక్టర్ గౌతంరావును సత్కరిస్తున్న కార్పొరేటర్ శంకర్ యాదవ్

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గౌతంరావును జీహెచ్‌ఎంసీ బీజేపీ ఫ్లోర్‌లీడర్, బేగంబజార్ కార్పొరేటర్ జి.శంకర్‌యాదవ్ ఆధ్వర్యంలో గజమాలతో ఘనంగా సత్కరించారు. ఆదివారం శంకర్ యాదవ్ మాట్లాడుతూ..గత ఎన్నికల ముందు ప్రజలకు అడ్డగోలుగా వాగ్దానాలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. స్థానిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీజేపీదే విజయమన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం చేపడుతున్న ప్రగతి, అభివృద్ధితో అన్నివర్గాల ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారన్నారు.


పోలియో చుక్కలు వేస్తున్న టీపీసీసీ కార్యదర్శి మనిలాల్‌షా


మంగళ్‌హాట్‌లో చుక్కలు వేస్తున్న మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్


కార్వాన్‌లో యూపీహెచ్‌ఎస్ కేంద్రంలో..డాక్టర్ శ్రీకాంత్‌యాదవ్


మెహిదీపట్నంలో...

పల్స్ పోలియో విజయవంతం

పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. ఆదివారం చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని కాలనీలు, బస్తీల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆయా డివిజన్లలో రాజకీయ నాయకులు, వైద్య శాఖ అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, వలంటీర్లు పాల్గొని సేవలను అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 5 ఏళ్ల లోపు ఉన్న ప్రతి చిన్నారికి తల్లిదండ్రులు పల్స్ పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజం నిర్మించాలని కోరారు.

– చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల బృందం


పోలియో చుక్కలు వేస్తున్న ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ మురళీధర్


చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న పులిపాటి రాజేష్‌కుమార్


అఫ్జల్‌సాగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో.. పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ ప్రియాంక


లలితాబాగ్‌లో..బీజేపీ నేత ఎడ్ల పండరీనాథ్

మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్గి ఉండాలి



అవగాహన సదస్సులో విద్యార్థినులు, అధ్యాపకులు

సుల్తాన్‌బజార్: వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, డైరెక్టర్ ఆఫ్ హాస్టల్స్, హైదరాబాద్ జూబ్లీహిల్స్ బ్రాంచ్ లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఆదివారం కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయంలో మానసిక ఆరోగ్యం, శ్రేయస్సు అనే అంశంపై ఒక్కరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 250 మంది డిగ్రీ హాస్టల్ బోర్డర్లు పాల్గొన్నారు. ఈ సెషన్‌లో విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, శ్రేయస్సుకుపై అవగాహన కల్పించారు. అలాగే నిరాశను అధిగమించడం, స్వీయ ప్రేమ, సానుకూల స్వభావం, తమతో తాము కనెక్ట్ అవ్వడం, భావోద్వేగం, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడాని ధ్యానం ప్రాముఖ్యత వంటి కీలక అంశాలపై ఈ అవగాహన సదస్సు జరిగింది. ఇలాంటి సదస్సులు విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతాయని మహిళా విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లోకపావని, హాస్టల్ డైరెక్టర్ డాక్టర్ విజయలక్ష్మి, వార్డెన్లు డాక్టర్ జ్యోతి, సునిత, డాక్టర్ సౌమ్య, డాక్టర్ నళిని పాల్గొన్నారు.

రూనీ శామ్యూల్‌కు జీవిత సాఫల్య పురస్కారం



గన్‌ఫౌండ్రీ: ఆల్ ఇండియా క్రిష్టియన్ ఫెడరేషన్, యూనెస్కోల సంయుక్తాధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో సామాజిక వేత్త ప్రొద్దుటూరి రూనీ శామ్యూల్ జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. సమాజ సేవ, మహిళా శక్తి అభివృద్ధి, విద్యారంగం, సామాజిక అవగాహన కోసం చేస్తున్న విశేష కృషికి గాను ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అంతర్జాతీయ సంస్థలు తన సేవను గుర్తించి పురస్కారం ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందని, రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహంగా సమాజ సేవా చేస్తానని తెలిపారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సోషలిస్ట్ పార్టీ పోటీ


మాట్లాడుతున్న సుభద్రారెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బరిలో సోషలిస్ట్ పార్టీ (ఇండియా) గెలుపే దిశగా ముందుకు సాగుతామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు రచ్చ సుభద్రారెడ్డి అన్నారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె పార్టీ అభ్యర్థిని ప్రకటించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి సోషలిస్ట్ పార్టీ కార్యకర్తలు, నాయకులు సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల బరిలో తమ పార్టీ పోటీ చేస్తుందని, ఎమ్మెల్యే అభ్యర్థిగా తొలిమలి దళ ఉద్యమకారిణిగా, విద్యావంతురాలిగా పేద ప్రజల కోసం పాటుపడుతామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా 6వ సారి బరిలోకి దిగుతున్నారు కాబట్టి జూబ్లీహిల్స్ నియోజకవర్గం ప్రజలు, విద్యావంతులు, వ్యాపారవేత్తలు, సెలబ్రిటీలు, నిరుపేద ప్రజలందరూ సోషలిస్ట్ పార్టీని గెలిపించాలని కోరారు.

వైభవంగా విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు


పూజల్లో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు

గౌలిపురా: పటేల్‌నగర్‌లోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో నూతన ఆలయ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటలకు స్వస్తివచనం, స్థాపిత దేవతా హోమాలు, మూలమంత్ర హవనం, చండీ హవనం, ఉదయం 10:45 గంటలకు రేణుకాఎల్లమ్మ అమ్మవారి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను వేదాంతం రాజసింహాచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. సాయంత్రం అమ్మవారి విశ్వరూప దర్శనం, హారతి, మహా పూర్ణాహుతి, శిఖర ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పునఃనిర్మాణ దాతలు అల్లం మధుశ్రీ, అల్లం శ్రీనివాస్ రావు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని పరిరక్షించుకోవాలి


జ్యోతిప్రజ్వలన చేస్తున్న సమాచార హక్కు చట్టం కమిషన్ చైర్మన్ పీవీ శ్రీనివాస్

గన్‌ఫౌండ్రీ: సమాచార హక్కు చట్టాన్ని రక్షించుకుని అమలు చేసుకోవాల్సిన బాధ్యత పౌర సమాజానిదేనని సమాచార హక్కు చట్టం కమిషన్ చైర్మన్ పీవీ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో సమాచార హక్కు చట్టం సాధన సమితి ఆధ్వర్యంలో సమాచార చట్టం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అనేక మంది త్యాగాల ఫలితంగానే సమాచార హక్కుచట్టం ఏర్పడిందని గుర్తుచేశారు. సమాచార హక్కుచట్టం అమలులో అధికారులు పారదర్శకంగా పనిచేయాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం కమిషనర్ భూపాల్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నేరెళ్ల మాల్యాద్రి, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ శంకర్‌నాయక్, సినీ నటుడు కిరణ్‌కుమార్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేష్‌గౌడ్, మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రవంతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



సాక్షి, సిటీబ్యూరో: బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఠాకూర్ జీవన్ సింగ్ సతీమణి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం గుడిమల్కాపూర్‌లోని ఆయన నివాసంలో మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఠాకూర్ విశ్వజీత్ సింగ్ రాజ్‌పుత్, ఠాకూర్ శ్రీధర్ సింగ్ పాల్గొన్నారు.

భక్తులకు పార్కింగ్ ఏర్పాట్లు చేయాలి


చార్మినార్ ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్‌కు ఆహ్వాన పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

చార్మినార్: దీపావళిని పురస్కరించుకుని ఆరు రోజుల పాటు నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారని..వీరి సౌకర్యార్థం ఉచితంగా పార్కింగ్ సౌకర్యం కోసం తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయ ట్రస్టీ సూర్య ప్రకాష్, బీజేపీ సీనియర్ నాయకులు ప్యారసాని వెంకటేష్ కోరారు. చార్మినార్ ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే దీపావళి వేడుకలకు హాజరుకావాలని ఆహ్వానపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు దీపావళి వేడుకలు వైభవంగా జరుగనున్నాయని..భక్తుల సౌకర్యార్థం చార్మినార్ పరిసరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ నెల 20న ఆలయంలో పూజలు నిర్వహించనున్నామని..ఈ పూజల్లో పాల్గొనాలని ఏసీపీని కోరామన్నారు.

ప్రధాన చౌరస్తాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు


పనులు పరిశీలించిన ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హఫాందీ

యాకుత్‌పురా: నియోజకవర్గంలోని ప్రధాన చౌరస్తాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, మజ్లిస్ ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హఫాందీ అన్నారు. ఆదివారం వారు స్థానిక కార్పొరేటర్లు, నాయకులతో కలిసి యాకుత్‌పురా, బాహ్మణ్‌వాడి, నాగాబౌలీ, జాఫర్ రోడ్డు, బడా బజార్, షేక్ ఫయాజ్ కమాన్ ప్రాంతాల్లో పర్యటించారు. బడా బజార్ ప్రధాన కూడలిలో నిర్మిస్తున్న క్లాక్ టవర్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఇప్పటికే పురాతన డబీర్‌పురా దర్వాజా, తలాబ్‌కట్టా రైల్వే బ్రిడ్జి, రెయిన్‌బజార్ చమన్ చౌరస్తా ప్రాంతాల్లో బ్యూటిఫికేషన్ పనులు చేపట్టామన్నారు. బస్తీల్లో అభివృద్ధి పనులు కొనసాగిస్తూ ప్రధాన చౌరస్తాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెయిన్‌బజార్, డబీర్‌పురా కార్పొరేటర్లు, మజ్లిస్ పార్టీ ఏరియా కమిటీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

లంబాడీల అస్తిత్వం కోసం ఉద్యమాలు చేస్తాం


రౌండ్ టేబుల్ సమావేశంలో జేఏసీ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: కొందరు గిరిజన, గోండు తెగకు చెందిన రాజకీయ నాయకులు అగ్రవర్ణ పెట్టుబడిదారుల చేతుల్లో కీలుబొమ్మగా మారి లంబాడి గిరిజనులను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేయడం అప్రజాస్వామికమని లంబాడి జేఏసీ కన్వీనర్ జాటోత్ కిషన్ నాయక్ అన్నారు. ఆదివారం కోఠి హనుమాన్‌టేక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో జేఏసీ రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జేఏసీ కన్వీనర్ కిషన్ నాయక్ మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధంగా గిరిజన జాబితాలో ఉన్న లంబాడిలను దూషించే వారిని దేశద్రోహులుగా నమోదు చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించిందన్నారు. లంబాడి హక్కులను కాపాడుకోవడానికి తమ జేఏసీ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలను చేస్తామన్నారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నేతలు జైసింగ్ రాథోడ్, రాంబాబు నాయక్, సునిల్, రమేష్‌నాయక్, మోహన్‌సింగ్ నాయక్, నెహ్రూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవతో యువతకు గుర్తింపు



గోల్కొండ: సమాజ సేవతో యువతకు గుర్తింపు లభించడమే కాకుండా సమాజంలో గౌరవం పెరుగుతుందని ప్రముఖ ఎన్ఆర్ఐ ఖురేషి భాయ్ అన్నారు. ఆదివారం టోలిచౌకీ అక్బర్‌పురాలో పీస్ ఫోర్స్ సొసైటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సమాజంలో వివిధ స్థాయిలో పని చేస్తున్న స్నేహితుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఖురేషి మాట్లాడుతూ..ఇటువంటి స్నేహ బృందాలు సమాజంలోని నిరుపేద వర్గాలకు అండగా ఉండి వారి పిల్లలు చదువుకునేందుకు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. పీస్ ఫోర్స్ సొసైటీ చైర్మన్ మహ్మద్ నజీబ్ మాట్లాడుతూ..పీస్ ఫోర్స్ సొసైటీని 15 ఏళ్ల క్రితం స్థాపించడం జరిగిందని కేవలం నిరుపేదలకు అండగా ఉండడానికి మాత్రమే ఈ సొసైటీ స్థాపించామన్నారు. ఈ కార్యక్రమంలో షేహబాజ్, ఇస్మాయిల్, సిద్ధిఖ్, బారి తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో మాతా విశాల్ జాగరణ


పూజల్లో నిర్మల జగ్గారెడ్డి, కమిటీ ప్రతినిధులు, భక్తులు

గౌలిపురా: గౌలిపురాలోని మహంకాళి మాతేశ్వరి భారతమాత ఆలయం, కోట మైసమ్మ ఆలయ ఆవరణలో శనివారం రాత్రి శ్రీ మాతా విశాల్ జాగరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భజన మండలి ఆధ్వర్యంలో ఆలపించిన భక్తి గీతాలతో స్థానిక ప్రాంతాల్లో ఆధ్యాత్మిక భక్తి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సీతారామరాజు, టీడీపీ పార్టీ నాయకులు సి.శివకుమార్ యాదవ్, గౌలిపురా బీజేపీ కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, వీరేందర్‌బాబు యాదవ్, ఆలే భాస్కర్ రాజ్, ఆలే జితేంద్ర, ఆదర్శ మహేశ్, చంద్రశేఖర్ (చందు), వివిధ ఆలయాల ప్రతినిధులు, ఉమ్మడి ఆలయాల అధ్యక్షుడు గోపి శెట్టి రాఘవేంద్ర, మధుసూదన్‌యాదవ్, దేనిష్ కుమార్, బుల్లెట్ శ్రీధర్, ఆలయ ప్రధాన కార్యదర్శి అల్లి మధుసూదన్ గిరి, ఇ.సుమన్‌కుమార్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు ఎం.ప్రకాశ్, మామిడి కృష్ణ, కె.ప్రకాశ్ రాజ్, వై.రామకృష్ణ పాల్గొన్నారు.

శాస్త్రీయ కళలను భావితరాలకు అందించాలి


చిన్నారులతో నాట్య గురువు ప్రసన్నరాణి తదితరులు

గన్‌ఫౌండ్రీ: భారత శాస్త్రీయ సంగీత కళలను భావి తరాలకు అందించాలని ప్రముఖ నాట్య గురువు డాక్టర్ ఆర్.ప్రసన్నరాణి అన్నారు. ఆదివారం ఆదర్శనగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో విజయ మాధవి సేవా సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో ముద్ర మంజీరం పేరిట నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..కూచిపూడి, భరతనాట్యం వంటి కళలను నేటి తరానికి చేరవేయడంలో కళా సంస్థల పాత్ర కీలకమన్నారు. అనంతరం పలువురు నాట్య గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సినీనటి సంధ్య జానకి, ఫిట్నెస్ ట్రైనర్ అను ప్రసాద్, నటుడు సుమిత్ రాయ్, ఆర్‌జే శేఖర్ బాషా, సంస్థ వ్యవస్థాపకురాలు విజయమాధవి తదితరులు పాల్గొన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న శశికళ

సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

చార్మినార్: రాబోయే దీపావళి వేడుకలకు హాజరుకావాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయ ట్రస్టీ శశికళ ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ నెల 20న దీపావళి వేడుకలను పురస్కరించుకుని ఆలయంలో పూజలను వైభవంగా నిర్వహించనున్నామని..ఈ పూజల్లో పాల్గొనాలని సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానపత్రం అందజేసినట్లు ఆమె తెలిపారు.

టోలిచౌకీ పీఎస్‌లో రాజాసింగ్‌పై ఫిర్యాదు

గోల్కొండ: మహ్మద్ ప్రవక్తపై అనుచిత వాఖ్యలు చేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై పలువురు ముస్లింలు టోలిచౌకీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం జిబ్రాన్, షాహిన్‌షా తదితరులు టోలిచౌకీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌నాయక్‌ను కలిసి రాజాసింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో సాబేర్‌ఖాన్, అఫ్సర్ జాహి, రషీద్ తదితరులున్నారు.

అలరించిన సంగీత కచేరి


సూర్య మీనాక్షిలను సత్కరిస్తున్న సాలూరి వాసురావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: నిరంతరాయంగా 108 పాటలతో సాగిన సంగీత కచేరి ఆహుతులను అలరించింది. ఆదివారం రవీంద్రభారతిలో మీనాక్షి గ్రూప్ ఆబాల గోపాలం సంస్థ ఆధ్వర్యంలో సినీ సంగీత సాహిత్య గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. అలనాటి మధుర గీతాల నుంచి నేటి నూతన పాటలు మొత్తం 108 గీతాలను గాయనీ గాయకులు ఆలపించి అలరించారు. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు సాలూరి వాసురావు మాట్లాడుతూ..సంగీతం మనస్సుకు ఆహ్లాదాన్ని కలుగచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంతి ఎస్.వేణుగోపాలాచారి, లిటిల్ మ్యూజిషియన్ అకాడమీ వ్యవస్థాపకులు రామాచారి, సంస్థ వ్యవస్థాపకులు తనికెళ్ల సూర్య మీనాక్షి, రంగస్థల నటులు డాక్టర్ ఎస్.గోపాలకృష్ణ, పసుమరి రాజరాజేశ్వరీ పాల్గొన్నారు.